ముమ్మరంగా వైఎస్సార్‌సీపీ ఎన్నికల ప్రచారం


కంతారం పంచాయతీలో ప్రచారం నిర్వహిస్తున్న దృశ్యం

గొలుగొండ: గ్రామాల్లో వైఎస్సార్‌సీపీ తరఫున నర్సీపట్నం ఎమ్మెల్యేగా ఉమాశంకర్ గణేష్ అనకాపల్లి ఎంపీ అభ్యర్థి బూడి ముత్యాలనాయుడు గెలుపు కోసం పార్టీ శ్రేణులు బుధవారం ముమ్మర ప్రచారం నిర్వహించారు. కొంకసింగి గ్రామంలో ఎంపీపీ గజ్జలపు మణికుమారి, పాతమల్లంపేటలో పార్టీ అధ్యక్షుడు లెక్కల సత్యనారాయణ, కంతారం గ్రామంలో సర్పంచ్ బిడిజాన రాజేశ్వరి, పుత్తడి గైరంపేటలో సర్పంచ్ పత్తి రమణ తదితర గ్రామ పంచాయతీల్లో ప్రచారం నిర్వహించారు. ప్రతి ఇంటికి వెళ్లి ఫ్యాన్ గుర్తుకు ఓటు వేయాలని కోరారు.

మాకవరపాలెం: ఈ నెల 13న జరగనున్న ఎన్నికల్లో వైఎస్సార్‌సీపీని గెలిపించాలని ఎంపీపీ రుత్తల సత్యనారాయణ, పార్టీ అధ్యక్షుడు శ్రీనివాస్ కోరారు. బూరుగుపాలెం, మాకవరపాలెం, తూటిపాల, తామరం గ్రామాల్లో బుధవారం రాత్రి ఎన్నికల ప్రచారం నిర్వహించారు. సంక్షేమ పాలన అందిస్తున్న సీఎం జగన్‌తోపాటు ఎంపీ అభ్యర్థి బూడి ముత్యాలనాయుడు, ఎమ్మెల్యే అభ్యర్థి పెట్ల ఉమాశంకర్‌గణేష్‌ను ఫ్యాన్ గుర్తుపై ఓటు వేసి గెలిపించాలని అభ్యర్థించారు.

ప్రశాంత ఎన్నికలకు సహకరించండి

ఎస్.రాయవరం : సార్వత్రిక ఎన్నికల సందర్భంగా గ్రామాల్లో ప్రజలు ప్రశాంత వాతావరణంతో మెలగాలని ఎస్ఐ విభీషణరావు అన్నారు. నక్కపల్లి సీఐ ఆధ్వ ర్యంలో మండలంలో బుధవారం ఎస్.రాయవరం, బంగారమ్మపాలెం, రేవు పోలవరం, తిమ్మాపురం, దార్లపూడి గ్రామా ల్లో కవాతు నిర్వహించినట్టు చెప్పారు. ఎన్నికలను దృష్టిలో పెట్టుకుని గ్రామస్తులకు అవగాహన కల్పించామన్నారు. ఓటర్లు పోలింగ్ రోజున స్వేచ్ఛగా, ప్రశాంతంగా ఓటు హక్కు వినియోగించుకోవాలన్నారు.

జగన్ వస్తేనే సంక్షేమం...అభివృద్ధి


పీఎల్‌పురంలో సీఎం జగన్ ఫొటో మాస్క్‌లో గ్రామస్తుల ప్రచారం


ఎస్.నర్సాపురంలో కంబాల జోగులు, చిక్కాల రామారావు ప్రచారం

పాయకరావుపేట : మండలంలో పీఎల్ పురం, సీతారాంపురం, నామవరం, ఎస్.నర్సాపురం, రాజగోపాలపురం, కందిపూడి, ఈదటం గ్రామాల్లో ఎమ్మెల్యే అభ్యర్థి కంబాల జోగులు ముమ్మరంగా ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఇంటింటికీ తిరిగి ఓటర్లను పలకరిస్తూ ఈ నెల 13న జరిగే ఎన్నికల్లో ఫ్యాన్ గుర్తుకే ఓటు వేసి వైఎస్సార్‌సీపీని అత్యధిక మెజార్టీతో గెలిపించాలని ఓటర్లను కోరారు. రాష్ట్రంలో బడుగు, బలహీన వర్గాలకు అమలు చేస్తున్న అనేక సంక్షేమ పథకాలు కొనసాగాలంటే మనందరం మళ్లీ జగన్‌మోహన్‌రెడ్డినే గెలిపించుకోవాలన్నారు. సీతారాంపురంలో ప్రచారంలో తప్పెడుగుళ్ల ఆడి గ్రామస్తులను ఆనందపర్చారు. పీఎల్‌పురంలో జగన్‌మోహన్‌రెడ్డి ఫొటో మాస్క్‌లను పెట్టుకుని యువత ప్రచారంలో పాల్గొన్నారు. నామవరం, ఎస్.నర్సాపురం, రాజగోపాలపురం, కందిపూడి, ఈదటం గ్రామాల్లో ప్రతి ఇంటికి తిరిగి ఓటర్లను ఓట్లు అభ్యర్థిస్తూ ప్రచారం నిర్వహించారు. ఈ ప్రచారంలో జిల్లా వ్యవసాయ సలహా మండలి చైర్మన్, పార్టీ మండల అధ్యక్షుడు చిక్కాల రామారావు, జెడ్పీటీసీ లంక సూరిబాబు, జిల్లా ప్రచార విభాగం అధ్యక్షుడు దగ్గుపల్లి సాయిబాబా, ఎంపీపీ ఇసరపు పార్వతీ తాతారావు, పీఎల్ పురం సర్పంచ్ పడాల దివాణం, సీతారాంపురంలో బీసీ సెల్ మండల అధ్యక్షుడు లోవకుమార్, రాజగోపాలపురంలో సర్పంచ్ లోవరెడ్డి, మండల యూత్ అధ్యక్షుడు గోవిందరెడ్డి, ఈదటం సర్పంచ్‌వెంకటరమణ, కందిపూడిలో సర్పంచ్ స్వరాజ్యం ధర్మాజీ, గుంటపల్లి ఎంపీటీసీ పల్లేల రామలక్ష్మి లక్ష్మణ్, ఎస్.నర్సాపురంలో గ్రామ శాఖ అధ్యక్షుడు పల్లేల కృష్ణార్జునరావు, పల్లేల వెంకట్, రామల శ్రీను, సోషల్ మీడియా నియోజకవర్గ ఇన్‌చార్జ్ కొంకిపూడి రామకృష్ణ పాల్గొన్నారు.

దురహంకారులకు ఈ ఎన్నికలు చెప్పదెబ్బ కావాలి


విలేకర్లతో మాట్లాడుతున్న జోగులు, రామారావు

నక్కపల్లి : సౌమ్యుడైన వ్యక్తి ఎమ్మెల్యేగా కావాలో, కార్యకర్తలను చెప్పుతో కొట్టే దురహంకారులైన వ్యక్తి కావాలో ప్రజలు తేల్చుకోవాలని ఎమ్మెల్యే అభ్యర్థి కంబాల జోగులు, జిల్లా వ్యవసాయ సలహామండలి చైర్మన్ చిక్కాల రామారావు అన్నారు. బుధవారం వారు ఎస్.నర్సాపురం, రాజగోపాలపురం తదితర గ్రామాల్లో ఎన్నికల ప్రచారం నిర్వహించిన అనంతరం విలేకర్లతో మాట్లాడారు. తాము ఓట్లేసిన ప్రజాప్రతినిధులు ప్రజలకు రక్షణగా నిలవాలని, పాలకులంటే తల్లిదండ్రుల్లాంటి వారన్నారు. గతంలో టీడీపీ ఎమ్మెల్యే కార్యకర్తలను చెప్పుతో కొట్టి యావత్ కాపు జాతిని తీవ్రంగా అవమానించారన్నారు. రాజకీయాల్లోకి వచ్చిన తర్వాత వివిధ వర్గాల వారికి జవాబు దారీగా ఉండాల్సి వస్తుందన్నారు. ఓట్లేసి గెలిపించిన ప్రజలకు సమాధానం చెప్పాల్సి ఉంటుందన్నారు. విమర్శలు, నిలదీతలు ఎదుర్కోవలసి వస్తుందని, ఇవన్నీ ఎదుర్కొనే ఓపిక సహనం ఉండాలన్నారు. అధికారం చేతిలో ఉంది కదా అని ఇష్టానుసారం ప్రవర్తిస్తే సమయం వచ్చినపుడు ప్రజలు గుణపాఠం చెబుతారన్నారు. చిక్కాల రామారావు మాట్లాడుతూ మూడుసార్లు ఎమ్మెల్యేగా గెలుపొందిన కంబాల జోగులు ఎంతో సౌమ్యుడైన వ్యక్తి అని అన్నారు. చేతనైతే ఉపకారం చేస్తారని, అపకారం మాత్రం చేయరన్నారు. అందుకే రాజాం నియోజకవర్గ ప్రజలు జోగులును మూడుసార్లు ఎమ్మెల్యేగా గెలిపించారన్నారు. ఇక్కడ కూడా అదే ఆదరణ చూపించి, జోగులును నాలుగోసారి గెలిపించాలన్నారు. మంచి మనసున్న కంబాల జోగులును ఎన్నుకుంటే ప్రజా సమస్యలను ఆయన దృష్టికి తీసుకెళ్లి పరిష్కరించుకోవచ్చన్నారు. పాయకరావుపేట ప్రజలు చాలా మంచి వారని, అందరినీ ఆదరిస్తారని, అక్కడ సేవ చేసే అవకాశం కల్పిస్తున్నాను.. తప్పకుండా గెలిపిస్తారని జగనన్న ఆదేశించడం వల్లే తాను ఇక్కడ పోటీ చేస్తున్నానని జోగులు అన్నారు. జగనన్న నమ్మకాన్ని వమ్ము చేయకుండా తనను గెలిపించి జగనన్నకు కానుకగా ఇవ్వాలని కోరారు.

నేడు కూడా పోస్టల్ బ్యాలెట్‌కు అవకాశం


ఓటు హక్కు వినియోగించుకున్న ఆర్‌వో గీతాంజలి

నక్కపల్లి : పోస్టల్ బ్యాలెట్ ను త్వరగా వినియోగించుకోవాలని పాయకరావుపేట రిటర్నింగ్ అధికారి కే గీతాంజలి కోరారు. బుధవారం ఆమె విలేకర్లతో మాట్లాడుతూ గడచిన మూడు రోజుల్లో పాయకరావుపేట నియోజకవర్గ పరిధిలో పోస్టల్ బ్యాలెట్ వినియోగించుకున్న వారి వివరాలు వెల్లడించారు. మొత్తం 2392 మందికి గాను ఇప్పటి వరకు 2122 మంది పోస్టల్ బ్యాలెట్ ద్వారా తమ ఓటు హక్కు వినియోగించుకున్నారన్నారు. ఎస్.రాయవరం మండలంలో 312 మందికి 297 మంది, నక్కపల్లి మండలంలో 245 మందికి 229 మంది, కోటవురట్ల మండలంలో 360 మందికి 340 మంది, పాయకరావుపేట మండలంలో 431 మందికి 413 మంది వినియోగించుకున్నారన్నారు. ఇతర జిల్లాలకు చెందిన 757 మందికి గాను 597 మంది వినియోగించుకున్నారన్నారు. అత్యవసర సర్వీసులకు చెందిన వారిలో 287 మందికి 246 మంది తమ ఓటు హక్కును పోస్టల్ బ్యాలెట్ వినియోగించుకోవడం జరిగిందన్నారు. మిగిలిన వారికి గురువారం కూడా పోస్టల్ బ్యాలెట్ వినియోగించుకునే అవకాశం కల్పించామన్నారు. ఆర్‌వో గీతాంజలి నక్కపల్లిలో తన ఓటు హక్కును వినియోగించుకున్నారు.

పోలింగ్ కేంద్రాల వద్ద ఏర్పాట్లు పూర్తి


సచివాలయంలో సిబ్బందికి సూచనలు చేస్తున్న ఎంపీడీవో జాగరపు రాంబాబు

నాతవరం : మండల వ్యాప్తంగా పోలింగ్ కేంద్రాల వద్ద ఎన్నికలు కమిషనర్ ఆదేశాలు మేరకు మౌలిక సదుపాయాలు కల్పించామని ఎంపీడీవో జాగరపు రాంబాబు అన్నారు. గన్నవరం మన్యపురట్ల నాతవరం వై.బి.పట్నం గ్రామ పంచాయతీల్లో పోలింగ్ కేంద్రాలను పరిశీలించారు. పోలింగ్ సమయంలో ఓటర్లకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా తీసుకోవలసిన జాగ్రత్తలపై సిబ్బందికి సూచనలు చేశారు. ఓటర్లకు స్లిప్పులు ఎంత వరకు పంపిణీ చేశారో అడిగి తెలుసుకున్నారు. రెండు జిల్లాల సరిహద్దులో ఏర్పాటు చేసిన చెక్‌పోస్టును తనిఖీ చేసి పోలీసులకు ఇతర అధికారులకు పలు సూచనలు చేశారు. పోలింగ్ కేంద్రాలతో పాటు ఆయా గ్రామాల్లో సచివాలయాలను క్షుణ్ణంగా పరిశీలించి పోలింగ్ సమయంలో సిబ్బంది అనుసరించాల్సిన విధి విధానాలను తెలిపారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శులు, వీఆర్వోలు, సచివాలయ ఉద్యోగులు పాల్గొన్నారు.

నేడు ఎమ్మెల్యే గణేష్ పర్యటన

నాతవరం : మండలంలో గురువారం ఎ.శరభవరం, ఎం.బి.పట్నం గ్రామాల్లో ఎమ్మెల్యే పెట్ల ఉమా శంకర్ గణేష్ ఎన్నికల ప్రచారం నిర్వహిస్తారని మండల పార్టీ అధ్యక్షుడు లగుడు నాగేశ్వరరావు అన్నారు. ఈ కార్యక్రమానికి ప్రజాప్రతినిధులు, నాయకులు, అభిమానులు, కార్యకర్తలు వైఎస్సార్‌సీపీ శ్రేణులంతా విధిగా హాజరు కావాలని విజ్ఞప్తి చేశారు.

ముగిసిన సమ్మర్ క్యాంపు


అతిథులకు జ్ఞాపిక అందజేస్తున్న విజయ్ ప్రకాష్

పాయకరావుపేట : శ్రీ ప్రకాష్‌లో 15 రోజులుగా నిర్వహిస్తున్న సమ్మర్ క్యాంపు ముగిసింది. ఈ సమ్మర్ క్యాంపులో విద్యార్థులకు యోగా, స్పోకెన్ ఇంగ్లిషు, ఆర్ట్ అండ్ క్రాఫ్ట్, టేబుల్ టెన్నిస్, సంగీతం, డాన్స్, బాస్కెట్‌బాల్, ఖోఖో, వాలీబాల్, క్రికెట్, హ్యాండ్‌బాల్, కబడ్డీ, స్కేటింగ్ తదితర అంశాల పై నిష్ణాతులైన కోచ్‌లతో శిక్షణ ఇచ్చారు. ఈ సందర్భంగా జరిగిన ముగింపు సభకు ముఖ్య అతిథిగా ఎంవి మాణిక్యాలు అంతర్జాతీయ వెయిట్ లిఫ్టర్ (ఒలింపియాడ్), గౌరవ అతిథిగా జిల్లా స్పోర్ట్స్ డెవలప్‌మెంట్ ఆఫీసర్ (రిటైర్డ్) ఎస్.సూర్యారావు హాజరయ్యారు. వారు మాట్లాడుతూ విద్యార్థులు విద్యతో పాటు వివిధ రంగాల క్రీడల్లో ఆసక్తి కనబర్చడం ఆనందదాయకమని అన్నారు. ఆటల ద్వారా గెలుపు ఓటములను సమానంగా స్వీకరించే ధైర్యం అలవడుతుందని తెలిపారు.

ఎన్నికల విధులు సక్రమంగా నిర్వర్తించాలి

నర్సీపట్నం : ఎన్నికల విధులను సక్రమంగా నిర్వర్తించాలని అసెంబ్లీ ఎన్నికల రిటర్నింగ్ అధికారి హెచ్.వి.జయరాం సెక్టార్ అధికారులకు సూచించారు. ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో బుధవారం నిర్వహించిన సెక్టోరల్ అధికారుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఈ నెల 13న జరిగే పోలింగ్‌లో ప్రజలు స్వేచ్ఛగా ఓటు వేసేందుకు అవసరమైన ఏర్పాట్లు ఆయా పోలింగ్ స్టేషన్‌ల్లో ఉండేటట్లు సెక్టోరల్ అధికారులు బాధ్యత తీసుకోవాలన్నారు. వారు పోలింగ్ బూత్‌లను ముందుగా సందర్శించి ఏమైనా లోపాలు ఉంటే తన దృష్టికి తీసుకురావాలన్నారు.

ఇంటింటికీ మేలు చేశాం...గెలిపించండి


వేములపూడిలో ప్రచారం నిర్వహిస్తున్న ఎమ్మెల్యే గణేష్

- ఎమ్మెల్యే ఉమాశంకర్ గణేష్
- వేములపూడిలో ఎన్నికల ప్రచారం


ఎమ్మెల్యేతో సెల్ఫీలు దిగేందుకు పోటీ పడుతున్న గ్రామస్తులు

నర్సీపట్నం: ప్రతి ఒక్కరికీ మేలు చేయాలన్న ఉద్దేశంతో సీఎం వైఎస్.జగన్‌మోహన్‌రెడ్డి దేశంలో ఎక్కడా లేని విధంగా సంక్షేమ పథకాలు అమలు చేస్తుంటే టీడీపీ నాయకులు అడ్డంకులు సృష్టించి నిరుపేద ప్రజలను ఇబ్బందులకు గురి చేస్తున్నారని ఎమ్మెల్యే పేర్కొన్నారు. నర్సీపట్నం మండలం వేములపూడి గ్రామంలో బుధవారం రాత్రి ఎమ్మెల్యే ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఇంటింటికీ వెళ్లి కరపత్రం అందజేసి చేసిన మేలు దృష్టిలో పెట్టుకొని వైఎస్సార్‌సీపీని ఆదరించాలని కోరారు. రెండు ఓట్లు ఫ్యాన్ గుర్తుపై వేసి ఎమ్మెల్యేగా తనను, ఎంపీగా బూడి ముత్యాలనాయుడును గెలిపించాలని కోరారు. 2014 ఎన్నికల్లో 600 హామీలు ఇచ్చిన చంద్రబాబు ఒక్క హామీ కూడా అమలు చేయలేదన్నారు. ఇప్పుడు సూపర్ సిక్స్ పేరుతో టీడీపీ విడుదల చేసిన మేనిఫెస్టోలో ఇచ్చిన హామీలను ప్రజలు నమ్మడం లేదన్నారు. వేములపూడిలో అనేక అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టామన్నారు. పొరపాటున అయ్యన్నపాత్రుడుకు ఓటేస్తే ఆయన కొడుకు నియోజకవర్గాన్ని సర్వనాశనం చేస్తారని విమర్శించారు. ఎంపీ అభ్యర్థి సీఎం రమేష్‌ను గెలిపిస్తే ఢిల్లీకి పోతాడు..స్థానికుడైన వైఎస్సార్‌సీపీ అభ్యర్థి బూడి ముత్యాలనాయుడుని గెలిపించుకుంటే మనందరికీ అందుబాటులో ఉంటారన్నారు. ఎంపీపీ రాజేశ్వరి, నాయకులు నర్సింహమూర్తి, పీఏసీఎస్ అధ్యక్షులు మురళీ, మండల పార్టీ అధ్యక్షుడు సత్యనారాయణ, లోవరాజు పాల్గొన్నారు.

జగన్ వస్తేనే అవ్వాతాతలకు భరోసా


కైలాసపట్నంలో సూర్యనారాయణరాజు ప్రచారం

కోటవురట్ల: జగన్‌ను మళ్లీ సీఎంగా చేసుకుంటేనే అవ్వాతాతలకు భరోసా ఉంటుందని ఎంఎస్ఎంఈ చైర్మన్ డి.వి.సూర్యనారాయణరాజు అన్నారు. కైలాసపట్నంలో ఆయన బుధవారం రాత్రి ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఇంటింటికీ వెళ్లి గతంలో చంద్రబాబు పాలనలో మోసాలు, అవ్వాతాతల కష్టాలు, జన్మభూమి కమిటీల ఆగడాలను వివరించారు. జగన్ పాలనలో ప్రతి కుటుంబం సుభిక్షంగా ఉందన్నారు. ప్రతి గ్రామంలోనూ రైతు భరోసా కేంద్రం, ఆరోగ్య కేంద్రం, సచివాలయం, డిజిటల్ లైబ్రరీలు నిర్మించి ప్రజల వద్దకే పాలనను తీసుకెళ్లారన్నారు. కార్యక్రమంలో సిద్ధాబత్తుల సత్యనారాయణ, మాజీ సర్పంచ్ నాగేశ్వరరావు, ఎంపీటీసీ రమణ, పార్టీ నాయకులు నానాజీ, వరహాలబాబు, సురేష్, రాంబాబు, అప్పలరాజు పాల్గొన్నారు. అలాగే పాములవాక, బి.కె.పల్లి, కె.వెంకటాపురం, కొడవటిపూడి గ్రామాల్లో నాయకులు విస్తృత ప్రచారం నిర్వహించారు.

సీఎం రమేష్‌ను తరిమి కొట్టండి


మాట్లాడుతున్న ఆడారి కిషోర్ కుమార్

నర్సీపట్నం : అనకాపల్లికి వలస వచ్చిన బీజేపీ ఎంపీ అభ్యర్థి సీఎం రమేష్‌ను ఈ ఎన్నికల్లో చిత్తు చిత్తుగా ఓడించేందుకు ప్రజలు సిద్ధంగా ఉన్నారని వైఎస్సార్‌సీపీ నాయకుడు ఆడారి కిషోర్‌కుమార్ పేర్కొన్నారు. పార్టీ కార్యాలయంలో బుధవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. లోకల్ వ్యక్తికి ఎంపీ టిక్కెట్ ఇవ్వాలని మాట్లాడిన మాజీ మంత్రి చింతకాయల అయ్యన్నపాత్రుడు కోట్ల రూపాయలకు అమ్ముడుపోయి సీఎం రమేష్‌కు ముందు మోకరిల్లుతున్నారన్నారు. రాజ్యసభ సభ్యుడిగా ఉన్న సీఎం రమేష్ ఏపీ ప్రత్యేక హోదా, విశాఖ రైల్వేజోన్, నీళ్లు, నిధుల గురించి ఏ ఒక్క రోజు నోరు విప్పలేదన్నారు. ఏపీ ల్యాండ్ టైట్లింగ్ యాక్టు తీసుకువచ్చింది కేంద్రంలో ప్రభుత్వమే అన్నారు.

వైభవంగా నూకాంబిక గంధం అమావాస్య జాతర


బోనాల ఊరేగింపు


నూకాంబిక అమ్మవారు

ఎస్.రాయవరం : మండల కేంద్రంతో పాటు కొరుప్రోలు గ్రామంలో గంధం అమావాస్య వేడుక ఘనంగా నిర్వహించారు. నూకాంబిక అమ్మవారి ఆలయం ప్రత్యేక పూజలు నిర్వహించి పసుపు కుంకుమతో సారె చీరలు సమర్పించారు. ఈ సందర్భంగా అమ్మవారిని దర్శించుకునేందుకు భక్తులు పోటెత్తారు. మరికొందరు భక్తులు ఆలయ ప్రాంగణంలో అగ్ని గుండములు తొక్కి మొక్కులు చెల్లించుకున్నారు. ఎస్.రాయవరంలో అమ్మవారి గరగ ఊరేగింపులో గరగను నెత్తిన పెట్టుకుని ఊరేగించుకునేందుకు భక్తులు పోటీపడ్డారు. కొరుప్రోలు నూకాంబిక అమ్మవారికి కొండపల్లి చక్రధరరావు ఇత్తడి గరగను అందించి తన భక్తిని చాటుకున్నారు.

మాకవరపాలెం: గంధం అమావాస్య సందర్భంగా బుధవారం మండల కేంద్రంలో దుర్గాలమ్మ పండగను స్థానికులు వైభవంగా జరుపుకొన్నారు. అధిక సంఖ్యలో మహిళలు సారె, బోనాలను గ్రామంలోని అన్ని వీధుల్లోనూ ఊరేగించి అమ్మవారికి నివేదించారు.